ప్రజాశక్తి
బుధవారం 3 జనవరి 2024
5
అనంతపురం



వైసిపిలో కొత్త సమన్వయకర్తలు

మూడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి కొత్త సమన్వయకర్తల రెండో జాబితాను విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి మూడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ప్రకటించారు. తాడేపల్లిలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం రాత్రి జాబితాను ప్రకటించారు.



ఉషశ్రీచరణ్ (పెనుకొండ అసెంబ్లీ)



తలారి రంగయ్య (కళ్యాణదుర్గం)



మక్బుల్ అహ్మద్ (కదిరి అసెంబ్లీ)

మార్పులు-చేర్పులిలా...

కొత్త జాబితా ప్రకారం హిందూపురం పార్లమెంటు, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు కొత్త వారిని తీసుకురాగా, తక్కిన స్థానాలకు పాత నేతలను కొత్త స్థానాలకు మార్చారు. హిందూపురం పార్లమెంటుకు జె.శాంతమ్మను నియమించారు. ఈమె మంగళవారం మధ్యాహ్నం వైసిపిలో చేరగా రాత్రికి ఆమెను హిందూపురం పార్లమెంటు సమన్వయకర్తగా నియమించారు. కర్నాటకలో బిజెపి నాయకురాలిగానే కాకుండా ఎంపీగానూ ఈమె పనిచేశారు. ఈమె బిజెపి మాజీ మంత్రి శ్రీరాములు సోదరి కావడం గమనార్హం. ఈమెను ఇక్కడ పార్లమెంటు సమన్వయకర్తగా నియమించడంతో హిందూపురం పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్ సీటు గల్లంతయ్యింది. ఇక పెనుకొండ ఎమ్మెల్యేగానున్న శంకరనారాయణను అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా మార్చారు. నిన్నటి వరకు ఆయన సత్యసాయి జిల్లా అధ్యక్షులుగానూ ఉన్నారు. ఆయన్ను అనూహ్యంగా అనంతపురం పార్లమెంటుకు తీసుకు వచ్చారు. ఇక అనంతపురం పార్లమెంటు సభ్యులుగానున్న తలారి రంగయ్యను కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్‌ను పెనుకొండ అసెంబ్లీ సమన్వయకర్తగా మార్చారు. తనను పెనుకొండ సమన్వయకర్తగా నియమించనున్నట్టు కొద్ది రోజుల క్రితమే ఆమె ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డికి ఈసారి అవకాశం లేనట్టుగానే కనిపిస్తోంది. ఆయన స్థానంలో మక్బుల్ అహ్మద్‌ను నియమించారు. రెండో జాబితా ప్రకారం చూస్తే హిందూపురం పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్, కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డిలిద్దరూ సిట్టింగ్ స్థానాలను పోగొట్టుకున్నట్టుయింది.



శంకర్‌నారాయణ (అనంతపురం పార్లమెంట్)



జె.శాంతమ్మ (హిందూపురం పార్లమెంట్)

తక్కిన వారిలో టెన్షన్ మొదలు

రెండో జాబితా వెలువడటం ఇందులో మూడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లో మార్పులుండటంతో తక్కిన వారిలోనూ టెన్షన్ నెలకొంది. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాలో 11 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రెండు, మూడు మినహా తక్కిన అన్ని స్థానాల్లోనూ మార్పులుంటాయని ప్రచారం వైసిపలో నడుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే జాబితాల్లో ఎవరెవరి పేర్లు వస్తాయన్నది సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠత నెలకొంది. అన్ని స్థానాల్లోనూ దాదాపు సంక్రాంతిలోపు వైసిపి అధిష్టానం ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. సమయం కూడా తక్కువగా ఉండటంతో నేతల్లోనూ గుబులు రేగుతోంది. సీటు దక్కుతుందా లేదా అన్న టెన్షన్ తక్కిన వారిలో నెలకొంది.



చి'వరి'కి మోసమే..!



- పంట కొనుగోలులో దళారుల దగా
- తూకాలు, ధరల్లో రైతులకు అన్యాయం
- స్థానికంగా మార్కెట్ సదుపాయం కరువు

ఆరుగాలం కష్టాలకోర్చి పంటను సాగు చేసిన రైతులు చి'వరి'లోనూ మోసపోతున్నారు. వర్షాభావం, సాగునీటి వనరులు అంతంత మాత్రంగానే ఉన్నా, అన్నదాతలు కష్టాల నడుమ వరిపంటను సాగు చేశారు. రైతు కష్టానికి తగ్గట్టుగా పంట దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. మంచి ధరతో పంటను అమ్ముకోవచ్చని భావించిన రైతును దళారులు అడుగడుగునా దగా చేస్తున్నారు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో చేసేది లేక దళారులు ఎంత చెబితే అంత, ఎలా చెబితే అలా అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంత కష్టం చేసిన చి'వరి'కి నష్టమే మిగులుతోందంటూ బొమ్మనహాల్ మండల వరి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలంలోని పలు గ్రామాల పరిధిలో తుంగభద్ర ఆయకట్టు కింద రైతులు వరి పంటను సాగు చేశారు. నీటి ఇబ్బందులున్నా ఉన్నా వాటిని ఎదుర్కొని పంటను పూర్తి చేశారు. దాదాపు 10 వేల ఎకరాల్లో సోనామసూరి, ఆరున్నర, నెల్లూరు సోనా తదితర రకాల వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం పంటను కోత కోసి అమ్మకాలు చేస్తున్నారు. ఇక్కడే దళారులు వారి మోసానికి తెరలేపుతున్నారు. తక్కువ తూకాలు, కనీస మద్దతు ధర ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోనమసూరి వంద కిలోలను రూ.2800కు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.3000వేలుగా నిర్ణయించినా దళారులు, వ్యాపారులు ఆ మొత్తాన్ని ఇవ్వడం లేదు. వివిధ కారణాలతో రూ.2800 మాత్రమే ఇస్తున్నారు.



అమ్మేందుకు సంచుల్లో సిద్ధం చేసిన వరిధాన్యం

తూకాల్లోనూ మోసం

వరిధాన్యం కొనుగోలులో తూకాల్లోనూ దళారులు మోసాలు చేస్తున్నారు. వరి ధాన్యాన్ని పెద్ద సంచుల్లో సేకరిస్తారు. ఇందులో 75 కిలోల వరి ధాన్యం పడుతుంది. ఈ 75 కిలోల సంచులన్నింటినీ లెక్కేసి దానిని క్వింటాళ్లలోకి మారుస్తారు. 75 కిలోల వది బస్తాలను రైతు నుంచి తీసుకుంటే దానిని 7.50 క్వింటాళ్లగా లెక్క గడతారు. ఇక్కడే దళారులు వారి మోసానికి తెరలేపుతారు. సంచి తూకం పేరుతో 2 కిలోలు, లాభం పేరుతో ఒక కిలో తీసేస్తారు. వంద కిలోలకు దాదాపు 5 కిలోల వరకు ఇలా వ్యాపారులు లెక్క నుంచి తీసేస్తారు. ఒక రైతు నుంచి 50 క్వింటాళ్లు వరి ధాన్యం సేకరిస్తే అందులో నుంచి సంచులు, లాభం పేరుతో 50 కిలోల వరకు తూకం నుంచి తీసేస్తారు. సాధారణంగా సంచి బరువు రెండు కిలోలు ఉండదని రైతులు చెబుతుంటారు. వ్యాపారులు మాత్రం దానిని ఆ తూకానికే లెక్కగడుతారు. దీని వల్ల రైతులు వంద కిలోలకు దాదాపు 5 కిలోలను నష్టపోవాల్సి వస్తోంది.

మార్కెట్‌సదుపాయం కరువు..!

స్థానికంగా ప్రభుత్వ మార్కెట్ సదుపాయం లేకపోవడంతో వ్యాపారులు, దళారులు ఏ ధర నిర్ణయిస్తే దాని ప్రకారమే రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బొమ్మనహాల్ మండల రైతులు మార్కెట్‌కు వెళ్లాలంటే బళ్లారి లేదా రాయదుర్గం వెళ్లాలి. అంతదూరం వెళ్లలేని రైతులు వ్యాపారులు ఎంత ధర నిర్ణయిస్తారో దానికి అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన ఉండడం లేదు.

అప్పులతో పంట కొనుగోలు

వ్యాపారులు పంట కొనుగోలు తరువాత డబ్బులు కూడా ఇవ్వడం లేదు. అప్పుగానే రైతుల నుంచి తీసుకుంటున్నారు. రెండు నెలల తరువాత డబ్బులు ఇచ్చేలా ముందుగానే మాట్లాడు కుంటున్నారు. దీంతో రైతులు పంటను అమ్మేసినా డబ్బు కళ్లజూడని పరిస్థితి ఉంది. గతేడాది కూడా ఇదే మాదిరి కొందరు వ్యాపారులు రైతుల నుంచి అప్పుకు పంటను కొని డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఉదంతాలు వెలుగు చూశాయి. దీనిపై రైతులు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. అయినా రైతులకు న్యాయం జరగలేదు. స్థానికంగా మార్కెట్ సదుపాయం లేక, ప్రభుత్వం పట్టించుకోకపోవడం తప్పని సరిపరిస్థితుల్లో అప్పునకే పంటను విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారులతో మోసం



వరిధాన్యం కొనుగోలులో దళారుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. వారి చెప్పిందే ధర.. తూచిందే తూకంగా ఉంటోంది. స్థానికంగా మార్కెట్ సదుపాయం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో దళారులకు పంటను విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం దీనిపై స్పందించి స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం కల్పించి కనీస మద్దతు ధరతో వరి పంటను కొనుగోలు చేయాలి.

వన్నూరప్ప, కురవల్లి గ్రామం, బొమ్మనల్ మండలం.



ఉరవకొండలో దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

దిగొచ్చే వరకూ సమ్మె..!

ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీల ఆగ్రహం

తమ న్యాయమైన సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో వినూత్నంగా అంగన్‌వాడీలు నిరసనలు చేపట్టారు. అందులో భాగంగా పలు ప్రాంతాల్లో దున్నపోతులకు వినతిపత్రాలు అందించారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కొంగుపట్టి వాహనదారులు, దుకాణాలు, తోపుడు బండ్ల వ్యాపారులతో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు.

వార్త 6లో



ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సిఎం స్పందించకుంటే.. ఉరే గతి..!

ఉరితాళ్లతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్-ఎస్ఎ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయకపోతే తమకు ఉరేగతి అని ఎస్ఎస్ఎ ఉద్యోగులు నిరసన తెలిపారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఎస్-ఎస్ఎ ఉద్యోగినులు మెడలో ఉరితాళ్లు వేసుకుని సామూహిక ప్రభుత్వానికి నిరసన తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, లేకపోతే చావేగతి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ ఛైర్మన్ విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కెజిబివి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, మండల స్థాయి అకౌంటెంట్‌లు, సిఆర్‌పిలు, మెసెంజర్‌లు, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్‌లు, ఐఆర్‌టిలు, సైట్ ఇంజనీర్‌లు, డిపిఒ సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు. రెగ్యులరైజ్ చేసేంత వరకు ఉద్యమం ఆగదని ఉద్యోగులందరూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు రామోమన్, సుమంత్, నాగరాజ్, సాయినీలెస్, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్, లింగరాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనాగ్రహం

అనంతలో మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన-ప్రజలను ఆలోచింపజేసిన కళాప్రదర్శన

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం.నాగరాజు అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ కార్మికులు కళారూపాన్ని ప్రదర్శించారు. కార్మికులపై పెంచుతున్న పనిభారం, కనీస వేతనాలు ఇతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ చేపట్టిన కళారూపం పలువురిని ఆలోచింపజేసింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డి ఫొటోలతో ఉన్న మాస్కులను ధరించి వారు కార్మికులపై అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, పనిభారం తగ్గింపు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి ఎన్నికల హామీలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగభూషణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, తిరుమల, ఎర్రిస్వామి, మల్లికార్జున, సంజీవరాయుడు, ఓబుళపతి, వరలక్ష్మి, లక్ష్మి నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడటంతోపాటు రోగాల బారిన పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులకు మద్దతు తెలిపిన రాంభూపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు వారంరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడం బాధాకరమన్నారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 126 మున్సిపాలిటీల్లో కంపు వాతావరణం నెలకొందన్నారు. తద్వారా ప్రజల్లో అనారోగ్యం పెరుగుతోందన్నారు. ఇందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్మికులు రోడ్డుపై వంటావార్పు చేసుకుని అక్కడే భోంచేశారు.



తాడిపత్రి మున్సిపల్ కార్మికులతో కలసి భోజనం చేసిన రాంభూపాల్

గుంతకల్లు : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు మంగళవారం పట్టణంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కె.నరసయ్య, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, జగదీష్, నాయకులు రాకెట్ల మస్తాన్, రంగనాయకులు, హనుమంతు, దాసు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు మంగళవారం గుత్తిలో గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు బి.నాగేంద్ర, ఈశ్వరయ్య కె.ఆంజనేయులు, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎస్.రాజా, ఉపాధ్యక్షుడు ఎస్.ఎ.మురళి, కార్యదర్శి రవిశంకర్ సహాయ కార్యదర్శులు నరసింహా, ఆది, కోశాధికారి నక్క శేఖర్, నాయకులు రాజ్ కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'అనంత'లో నృత్య రూపం ఇలా...

"పబ్లిక్ కొళాయిలు, గహకనెక్షన్లలో తాగునీరు రావడంలేదని ప్రజలు ఫిర్యాదులు చేస్తుంటారు. ఈ సమస్య పరిష్కరించాలని ప్రభుత్వ సలహాదారు మంత్రికి ఆదేశాలు జారీ చేస్తారు. ఈయన ఆదేశాలు ఇవ్వడమే కానీ నిధులు మంజూరు చేయరు. నిధులు లేకుండానే పనులు మాత్రం సాఫీగా జరిగిపోవాలని హుకుం జారీ చేస్తుంటారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి కుళాయిల్లో నీరు రాకపోవటానికి కారణం అన్వేషించాలని, ఇందుకు ఓ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశిస్తారు. ఈ కమిటీ ఏం పని చేస్తుందో ఎవరికీ తెలియదు. కిందస్థాయిలో మాత్రం నీటి సమస్యకు పరిష్కారం దొరకదు. క్షేత్రస్థాయిలో కార్మికులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏమిటనేదానిపై ప్రభుత్వం నుంచి స్పందన ఉండదు. ప్రజలు ప్రభుత్వం ఏదో చేస్తుందని ఎదురుచూస్తూ ఉంటారు. ఆ పని ఎన్నాళ్లకీ పరిష్కారం కాదు. వీధిలైట్ల మరమ్మతులో విద్యుత్ కార్మికుడు కరెంటు షాక్ తగిలి స్తంభంపై నుంచి జారపిడి మరణిస్తాడు. ఈ కుటుంబాన్ని ఆదుకునే చర్యలు కూడా ప్రభుత్వం తీసుకోదు. ముఖ్యమంత్రి మాత్రం ప్రజలు, కార్మికులకు ఎలాంటి సమస్యలూ లేవని అందరినీ సమన్వయం చేసుకుని పరిష్కరించేస్తుంటామనే భ్రమలో ఉంటూ పాలన సాగిస్తుంటారు.' కమిటీల పేరుతో ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా మొద్దనిద్రలో ఉందనే దృశ్య రూపాలతో కార్మికులు ప్రదర్శించిన నృత్యం ప్రజలను ఆలోచింపజేసింది.



ప్రభుత్వ వైఫల్యాలను కళారూపం ద్వారా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ : మండల పరిధిలోని మైలారంపల్లి గ్రామంలో పలువురికి మంజూరైన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడు మైలారంపల్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమణించి వారు కోరుకున్న అనువైన స్థలాల్లో పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పయ్యావుల వెంకటరమణప్ప, వేలూరు నారాయణస్వామి, పయ్యావుల ఎర్రిస్వామి, వేలూరు కేసన్న, మాజీ ఎంపీటీసీ నాగన్న, వడ్డే సురేష్, హరిజన లాలప్ప, వడ్డే ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థిని

అనంతపురం : నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థిని వడ్డే దేదీప్య సాయి ఎస్‌జిఎఫ్ అండర్-14 జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పుల్లారెడ్డి తెలిపారు. ఈమేరకు విద్యార్థినిని మంగళవారం అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న శ్రీసాయి విద్యానికేతన్ సిబ్బంది

విప్ 'కాపు'నకు మద్దతుగా పలువురు రాజీనామా

రాయదుర్గం : వచ్చే ఎన్నికల్లో విప్ కాపు రామచంద్రారెడ్డికి వైసిపి టికెట్ నిరాకరించినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన పలువులు డి.హీరేహాల్ నాయకులు తమ సభ్యత్వాలు, పదవులకు మంగళవారం రాజీనామాలు చేశారు. రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు వి.భోజరాజునాయక్, డి.హీరేహల్ మండల ఎంపిపి పవిత్ర, ఉపాధ్యక్షులు లింగప్ప, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, మండలంలోని పలువురు సర్పంచులు ఎంపిటిసిలు, పార్టీ నాయకులు రాజీనామాలు చేశారు.



రాజీనామాలు అందజేస్తున్న నాయకులు

'ఆరోగ్యశ్రీ'పై అవగాహన

నార్పల : నిరుపేదలు ఏవైనా అనారోగ్య సమస్యలు, ప్రమాదాలకు గురైతే ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎలా ఉపయోగించుకోవాలి అన్న విషయాలపై ఎంపిడిఒ దివాకర్ మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా 104, విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్యసేవలు, 108, ఫ్యామిలీ డాక్టర్‌తోపాటు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందడానికి ఏఏ పత్రాలు తీసుకెళ్లాలి, ఎవరెవరిని కలవాలనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు.

అడుక్కు తినాలా..

భిక్షాటన చేస్తూ అంగన్వాడీల నిరసన-నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన-దున్నపోతులకు వినతిపత్రాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'న్యాయమైన సమస్యల సాధనకు రోడ్డెక్కి వచ్చి ఆందోళన చేస్తున్నాం.. అయినా రాష్ట్ర ప్రభుత్వం చలనం లేకుండా ఉంది.. వేతనాలు కూడా వచ్చే పరిస్థితి లేదు.. ఇలా చేస్తే అడుక్కుతిని బతకాలా..' అంటూ అంగన్‌వాడీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట కొంగపట్టి వాహనదారులు, దుకాణాలు, తోపుడు బండ్ల వ్యాపారులతోపాటు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వీరి సమ్మెకు కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులు, నగర కార్యదర్శి ముత్తుజా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జయభారతి, జమున, అరుణమ్మ, కాత్యాయని, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు. తాడిపత్రిలో అంగన్వాడీలు ఎద్దులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రాంభూపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరం ముందు ఏర్పాటు చేసిన పోరాట విరాళ హుండీకి ప్రజలు రూ.52,470 విరాళం అందజేశారు. నార్పలలో అంగన్వాడీలు దున్నపోతుకు వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ ప్రాజెక్టు అధ్యక్షురాలు డొక్కా శ్రీదేవి, సెక్టార్ లీడర్లు ఎం.రామాంజనమ్మ, సుధామని, రేణుక, వెంకటలక్ష్మి, కళావతి, అంగన్వాడీలు పాల్గొన్నారు. బొమ్మనహాల్ మండలంలో ర్యాలీగా వెళ్లి బర్రెకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బొమ్మనహాల్, కనేకల్ మండలాలకు సంబంధించిన అంగన్వాడీలు పాల్గొన్నారు. పామిడి మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా ధృతరాష్ట్రుడు, ద్రౌపతి వేషధారణలో నిరసన తెలిపారు. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు నారాయణమ్మ, భారతి, అనిత, రామాంజనమ్మ, రమాదేవి, సెకున్‌బీ, ప్రేమకుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు. రాయదుర్గంలో అంగన్వాడీలు ఆవుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెద్దవడుగూరులో అంగన్వాడీ కార్యకర్తలు దున్నపోతుకు, బర్రెలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. గుత్తిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, మండల కార్యదర్శి కె.రామాంజనేయులు, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయప్ప, కోశాధికారి పుల్లన్న, నాయకులు షేక్షావలి, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, సిపిఎం మండల కార్యదర్శి వి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి. రమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు పార్వతి, కళ్యాణి, శారద, బావమ్మ, శోభ, గంగ, తదితరులు పాల్గొన్నారు. గార్లదిన్నెలో బస్టాండ్ నుంచి తహశీల్దార్ వరకూ అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. వీరికి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రతినిధులు లలిత, అరుణ, దేవి తదితరులు పాల్గొన్నారు. గుంతకల్లులో అంగన్వాడీలు గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రేష్మా, గంగ, నాయకురాళ్లు నాగమణి, జూళి, పార్వతి, మేరీ, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, నాయకులు తిమ్మప్ప, సురేంద్ర పాల్గొన్నారు. ఉరవకొండలోతోపాటు విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా దున్నపోతులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగమణి, సిపిఎం ఉరవకొండ, వజ్రకరూరు మండలాల కన్వీనర్లు మధుసూదన్, విఠపక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకులు రంగమ్మ, వరలక్ష్మి, శ్వేత, సరోజమ్మ, ధనలక్ష్మి, విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, సువర్ణమ్మ, కృష్ణవేణి, మంజుల, నాగవేణి, లోకమ్మ, శివశ్రీ, తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరులో దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. వీరికి సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, అంగన్వాడీలు, పాల్గొన్నారు.



అనంతపురంలో భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు



నార్పలలో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు



అంగన్వాడీల సమ్మెలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అంగన్వాడీలపై ప్రభుత్వం అహంకారం వీడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రభుత్వం అహంకారం వీడి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారి లక్ష మంది మహిళా కార్మికులు 23 రోజులుగా సమ్మె చేయడం బాధాకరమన్నారు. సిఎం జగన్ వైఖరివల్లే అంగన్వాడీ సమ్మె నిరవధికమన్నారు. అంతేగాకుండా సమ్మెను విరమించకపోతే కఠినంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ల ద్వారా అంగన్వాడీలను బెదిరించడం అప్రజాస్వామికం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీలకు మద్దతు ఇచ్చిన జగన్ నేడు వారి సమ్మెను అణచాలని చూస్తే తిరిగి ప్రతిపక్షంలోనే కూర్చోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా నేడు కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున చేపట్టనున్న సిపిఎం ప్రత్యక్షంగా మద్దతు ఇస్తోందని తెలిపారు. అనంతరం పశువులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నూరి, మండల నాయకులు చౌదరి, పెద్దయ్య, భాగ్యలక్ష్మి, నాగభూషణ, అంగన్వాడీ నాయకురాళ్లు జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భూ యజమానులకు నష్టం కలిగిస్తూ, రాజకీయ దళారులకు, భూ కబ్జాదారులకు వరంలాగ మారిన భూ హక్కు చట్టం 27 జిఓను రద్దు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భూ హక్కు చట్టం రద్దు కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో దశలవారి పోరాటాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. భూమి ఇతర స్థిరాస్తి హక్కులను న్యాయవ్యవస్థ పరిధిలో నుంచి తొలగించి అధికార పార్టీ రాజకీయ దళారి కబ్జాదారులకు అప్పగించడమే చట్టం ముఖ్య ఉద్దేశంగా ఉందన్నారు. ఈ చట్టం ప్రకారం ఎటువంటి అర్హత లేని న్యాయశాస్త్ర అవగాహన లేని వారిని రాజకీయ పలుకుబడితో ఉపయోగించి బలహీనులైన రైతులను భూమిలో నుంచి వెళ్లగొట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. భూ హక్కు చట్టం రద్దు కోసం కోసం రైతాంగాన్ని సమీకరించి దశలవారీగా పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అలాగే అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోతలయ్య, ఇల్లూరు నల్లప్ప, సంగప్ప, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహం

పుట్లూరు : రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచిన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అనూహ్యారెడ్డికి భూమిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం రూ.10వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, శింగనమల మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ భూమిరెడ్డిగారి సునీతమ్మ, నాగార్జునరెడ్డి మాట్లాడుతూ మండలానికి చెందిన విద్యార్థి అనూహ్యారెడ్డి రాష్ట్రస్థాయి నుంచి సౌత్ ఇండియన్ సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. విద్యార్థిని మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న భూమిరెడ్డి ట్రస్టు సభ్యులు

శ్రీకాళహస్తి ఆలయంలో తవ్వకాలు దుర్మార్గం

శింగనమల : శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తవ్వకాలు చేపట్టడం దుర్మార్గమని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. పురాతన శ్రీకాళహస్తి ఆలయంలో స్వామి అమ్మవార్లకి నైవేధ్యాలు తయారు చేసే గది, మృత్యుంజయ పూజలు నిర్వహించే ప్రదేశంలో వేల ఏళ్ల నాటి చారిత్రక కట్టడాలను కూల్చేయడం బాధాకరమన్నారు. పురావస్తు, దేవాదాయ శాఖ నిబంధనలు పట్టించుకోకుండా, వీఐపీల ఆశీర్వాదాల కోసం శ్రీకాళహస్తి ఆలయంలో తవ్వకాలు చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

సర్పంచి పెద్దన్నకు పరామర్శ

నార్పల : అనారోగ్యానికి గురై అనంతపురంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని బండ్లపల్లి పప్పూరు సర్పంచి చీమల పెద్దన్నను టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ రాజు మంగళవారం పరామర్శించారు. ఇందులో భాగంగా పెద్దన్న ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం పెద్దన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు సత్తి, సుధాకర్, గంగాధర, గుత్తా నాయుడు, చలపతి, సంజీవ్, నరసన్న, రాజు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పామిడి : గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామిడి గ్రామ పంచాయతీ పరిధిలో పరిశుభ్రత, పారిశుధ్యం తదితర వాటిల్లో మెరుగుదల కనిపించాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అలాగే రోడ్లు, కాలువల జలమార్గాలు మొదలైన మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పురోగతి చూపాలన్నారు. వీధిదీపాలను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయాలన్నారు. పామిడి గ్రామ పంచాయతీ గ్రామసభ పారదర్శకత, జవాబుదారీతనం, సమన్యాయానికి, ప్రజాస్వామ్యానికి వేదికగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఖాజామైనుద్దీన్, ఎం.అబ్దుల్ హుస్సేన్, పంచాయతీ సిబ్బంది నాగరాజు, ఈశ్వరయ్య, సచివాలయ సిబ్బంది, మెప్మా అధికారి చంద్ర, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఉరవకొండ : విద్యార్థులు విద్య తోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఖోఖో జిల్లా కమిటీ అధ్యక్షులు వై.భీమారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ పథకం కింద కెనరా బ్యాంకు వారు విద్యార్థులకు క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వంలో సర్కారు బడులు రూపురేఖలు మారిపోయాయన్నారు. కార్పొరేట్ పాఠశాలలను మించిన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా విద్యార్థులకు ఆంగ్లంలో బోధన సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వీటితోపాటు అనేక సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ పథకం కింద కెనరా బ్యాంకు వారు క్రీడా పరికరాలతోపాటు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు డిఎం వై.వెంకటరామిరెడ్డి, సీనియర్ మేనేజర్ కట్ట శ్రీధర్, బ్రాంచి మేనేజర్ డి.శ్రీనివాసనాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రవణ్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఉపాధ్యా యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష

రాయదుర్గం : పట్టణంలో బుధవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష-2కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘం పరిధిలో ప్రతి బుధవారం ఒక సచివాలయం చొప్పున సమీప ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు కావేటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌కుమార్ కావేటి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని అరవిం ద్‌నగర్ మెయిన్ రోడ్డులో నూతనంగా నిర్మించిన కావేటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి బుధవారం ప్రారంభిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్, పలమనాలజిస్ట్ డాక్టర్ సతీష్‌కుమార్ కావేటి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ దశాబ్దకాలంగా అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రజలు తమను ఆదరిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలోనూ అత్యుత్తమ సేవలు అందించామన్నారు. ప్రజల సౌకర్యార్థం మెరుగైన వైద్యం అందించేందుకు మూడు ఫ్లోర్లలో 50 పడకల ఆసుపత్రిని మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించే క్రమంలో ఆసుపత్రిలో పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్, న్యూరోసర్జరీ, న్యూరాలజీ పీడియాట్రిక్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఇఎన్‌టి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులు అధికారులు హాజరవుతున్నట్లు వివరించారు.



కావేటి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి (ఇన్‌సెట్‌లో) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌కుమార్ కావేటి

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల బిటెక్ 2వ సంవత్సరం, 1వ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. విద్యార్థులు ఫలితాల కోసం కళాశాల అకాడిమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని ప్రినిపల్ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్స్ డాక్టర్ డి.విష్ణువర్ధన్, డి.లలితకుమారి, విభాగాధిపతులు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కెఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, కె.కళ్యాణి రాధ, ఎ.శైలాకుమారి, బి.దిలీప్‌కుమార్, బి.అజిత పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాలు మేరకు ఆత్మకూరు ఎస్ఐ జనార్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రహదారి 544-డిపై వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ వెళ్లరాదని, అతివేగంతో వాహనం నడపరాదని సూచించారు.

వాహనాల తనిఖీ

జిల్లావ్యాప్తంగా పోలీసులు మంగళ వారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో భాగంగా మద్యం, గంజాయి, నిషేధిత గుట్కా అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు చేపట్టారు. అంతేకాకుండా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు తీసుకున్నారు.

ఎపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

శింగనమల : మండల ఏపీటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శి రామమూర్తి, గౌరవాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి కె.సూర్యనారాయణ, వన్నూరప్ప, సత్యవతి, రాందాస్, జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్, బాషా, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా టీషర్టులు, టోపీల ఆవిష్కరణ

ఉరవకొండ : విడపనకల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు సంబంధించిన దుస్తులు, టోపీలను ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పీటీసీ హనుమంతు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 18 సచివాలయాలకు 2052 టీషర్టులు, 2052 టోపీలు వచ్చాయన్నారు. క్రీడాకారులు వీటిని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి సత్యబాబు, పంచాయతీ కార్యదర్శులు బాషా, సోమయ్య, రామకృష్ణ, సురేష్‌బాబు, అబ్దుల్ మునాఫ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో వినతుల వెల్లువ

అనంతపురం : ఆకుతోటపల్లి పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గ్రామసభకు వినతులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు టివి.రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా ఏర్పడిన గ్రామసభలు నిబంధనలు మేరకు అమలు కావడం లేదన్నారు. అలా అమలైనప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం అమలవుతుందన్నారు. అనంతరం పలు సమస్యలపై పంచాయతీ కార్యదర్శి రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అల్తాఫ్, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి. మంజునాథ్ పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఉరవకొండ : ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు అధిక ధరలకు ఎరువులను అమ్మినా, నాసిరకమైన ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని ప్రత్యేకాధికారి, తాడిపత్రి ఎడిఎ చెంగల్ రాయుడు హెచ్చరించారు. మంగళవారం ఉరవకొండలోని వివిధ ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సీతారామ ఎంటర్‌ప్రైజెస్, శ్రీసాయి రామప్ప ఫర్టిలైజర్, మహాలక్ష్మి దుకాణాల్లో అనుమతులు లేని మందులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శుభకర్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బీమా సొమ్ము పంపిణీ

గుత్తి : మున్సిపాలిటీలోని 15వ వార్డులో నివాసం ఉండే లబ్ధిదారులకు మంగళవారం బీమా సొమ్ము పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన నగదాని ప్రేమ్ కుమార్, రంగనాయకులు మూడు నెలల క్రితం మరణించారు. దీంతో మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిన బీమా సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షులు, వైసిపి యువనేత మంజునాథరెడ్డి, కౌన్సిలర్ మాతంగి అంజలి, కౌన్సిలర్లు వెంకటరమణ, వి.వరదరాజులు, నాయకులు డి.షఫీ, హమాలీ రామంజి, సునీల్, చంద్ర, చెన్నాజీ, వైసిపి ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శి ముని, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం : రుద్రంపేట పంచాయతీలో రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు వేయకపోతే ట్యాక్స్‌లు చెల్లించవద్దని ఉప సర్పంచి నరేంద్రరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక రుద్రంపేట పంచాయతీలో అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శి హిదాయతుల్లా అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ ఏర్పాటు, బోర్లు వేసేందుకు బిల్లులు పెట్టుకుంటున్నారని, అయితే కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు బిల్లులు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. రుద్రంపేట మెయిన్ రోడ్డు, ఇతర డ్రెయినేజీ సమస్యలు ఉన్నా పరిష్కారం కావడం లేదన్నారు. ఇలాగే ఉంటే రానున్న ఎన్నికల్లో ఓట్లు కూడా వేయొద్దని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పద్మావతి, వాలంటీర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప సర్పంచి నరేంద్రరెడ్డి

7న రెడ్ల ఆత్మీయ సభ

అనంతపురం : రెడ్ల ఐక్యత చాటేలా ఈనెల 7న అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆత్మీయ సభ నిర్వహించనున్నట్లు ఎపి రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సభలో పేద రెడ్లకు రుణాలు అందించాలని, రెడ్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. రాజకీయలకు అతీతంగా రెడ్లందురూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, నాయకులు పాటిల్ రామకృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, మధుసూదనరెడ్డి, బాగ్యలక్ష్మీరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, నరసింహారెడ్డి

పుట్లూరు : ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రెడ్ల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని పుట్లూరు మండలం రెడ్డి సంఘం అధ్యక్షుడు భీమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం మండలంలోని ఎస్.గూడూరులో రెడ్డి సంఘం నాయకులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా నాయకులు దయ్యం హనుమంతురెడ్డి, రాకేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, భీమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న రెడ్డి సంఘం నాయకులు

మీసేవా నిర్వాహకుడిపై ఫిర్యాదు

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని నాగసముద్ర గ్రామంలో ఉన్న మీసేవా కేంద్రం నిర్వాహకుడు నాగేంద్రగౌడ్‌పై మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. నాగసముద్రం గ్రామానికి చెందిన వాల్మీకి ముత్యాలమ్మ బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉన్న రూ.20వేలు ఉండటంతో రూ.10వేలు తీసుకోవాలని వెళ్లింది. అయితే బ్యాంకు అధికారులు రూ.20వేలలోపు బ్యాంకుమిత్రతో తీసుకోవాలని సూచించారు. దీంతో అదే గ్రామానికి బ్యాంకుమిత్ర నాగేంద్ర గౌడ్ వద్దకు వెళ్లి వేలిముద్ర వేసింది. అయితే నెట్‌వర్క్ సరేగా లేదని గంట తర్వాత రావాలని సూచించాడు. అయితే అప్పటికే వేలిముద్ర తీసుకున్న నాగేంద్ర బాధితురాలి ఖాతా నుంచి రూ.10వేలు డ్రా చేసుకున్నాడు. గంట తర్వాత వెళ్లిన బాధితురాలు డబ్బులు ఇవ్వాలని కోరడంతో మీ బ్యాంకు హ్యాక్ అయి డబ్బులు కాజేశారని బుకాయించాడు. దీంతో బాధితులు బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా నాగేంద్ర అకౌంట్‌లోకి డబ్బులు వెళ్లాయని చెప్పారు. చేసేదిలేక బ్యాంకు వివరాలను తీసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి నాగేంద్రపై ఫిర్యాదు చేశారు. వెంటనే నాగేంద్రపై చర్యలు తీసుకోవడంతోపాటు తమ సొమ్మును ఇప్పించాలని కోరారు.

బాలాపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని బాలాపురం పంచాయతీలో మంగళవారం 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరి ంచడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, నాయకులు రవిచంద్రనాయుడు, ఓబుళనాయుడు, రామాంజనేయులు, నాగరంగయ్య, చంద్రశేఖర్‌నాయుడు, తీర్థమయ్య, బాల రంగయ్య, రంగయనాయకులు, గంగయ్య, నరసింహా, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల పరిధిలోని గజరాంపల్లి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు సురేష్‌బాబు, చెన్నరాయుడు, బేతాపల్లి శ్రీన, చంద్రశేఖర్, శ్రీనివాసులు, కుళ్లాయప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైఎస్ఆర్ తక్షణ సాయం అందజేత

పామిడి : మృతిచెందిన మండలంలోని పి.కొండాపురానికి చెందిన బాల రంగన్న భార్య సులోచనకు తక్షణ సాయం కింద రూ.10వేలను అధికారులు, నాయకులు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మునగల రంగనాయకులు, సచివాలయ అడ్మిన్ సురేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆంజనేయులు, వాలంటీర్ నల్లప్ప, ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ధనుంజయ (34) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ధనుంజయ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇదులో భాగంగానే ఆటో నడిపి సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చి భార్యా పిల్లలతో గడిపాడు. అయితే రాత్రి అందరూ నిద్రపోయాక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు కౌశిక్ ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గార్లదిన్నె ఎస్ఐ సాగర్ తెలిపారు.

కర్నాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాలు మేరకు డి.హీరేహాళ్ ఎస్ఐ రంగడుయాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కర్నాటకకు చెందిన టెట్రా పాకెట్లను పట్టుకున్నారు. ఇందులో భాగంగా డి.హీరేహాల్ మండలం సోమలాపురం వద్ద ఓ వ్యక్తిని అరెస్టు చేసి 480 కర్నాటక టెట్రా పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.